



ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# జనం ముచ్చట

సోమవారం, సెప్టెంబర్ 14, 2026 | తెలంగాణ | పేజీలు : 4




ఖమ్మంలో హోరెత్తిన...



పొంగులేటిపై గడల శ్రీనివాస్ సంచలన సవాల్

వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదట ఓడేది మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డే: గడల శ్రీనివాస్

పాలేరు నుంచి పోటీ చేసినా ఓటమి తప్పదని వ్యాఖ్య

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జనసైనికులకు పిలుపు

# జనసేన శంఖారావం

**సభకు ముందు జనసేన శ్రేణులు నగరంలో భారీ ర్యాలీ ...**

ఖమ్మం జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ శ్రేణులు కదం తొక్కాయి.జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ శంఖారావం' బహిరంగ సభ,భారీ బైక్ ర్యాలీలో యువత కథం తొక్కారు,ఖమ్మంలోని SR&BGNR ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమైన బైక్ ర్యాలీ అక్కడి నుంచి బైపాస్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్ ప్రాంతం, రాపర్తి నగర్ మీదుగా కొనసాగిన ర్యాలీ వీడీ ఫంక్షన్ హాల్‌లోని పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సభా వేదికకు చేరుకుంది. వేలాది బైకులతో జనసైనికులు, వీర మహిళలు, యువత ర్యాలీలో పాల్గొన్నారు. జనసేన జెండాలు చేతబూని భారీ సంఖ్యలో

2 లో..

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ తెలంగాణ నాయకత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలోని ఎంబీ గార్డెన్‌లో జనసేన తెలంగాణ జనసేన శంఖారావం సభను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన నాయకుడు గడల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాది మంది జనసైనికులు హాజరయ్యారు, ఈ సభలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని చాటడం, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలను సన్నద్ధం చేయడంపై సభలో ప్రధానంగా చర్చించారు.



2 లో..

## ఖమ్మంలో జనసేన 'తెలంగాణ శంఖారావం'..

# రాష్ట్ర నేతల రాజకీయ గర్జన

అధికార పార్టీల వైఫల్యాలపై తీవ్ర విమర్శలు....

గిరిజన బాలిక హత్య ఘటనపై న్యాయపోరాటానికి హామీ

వనజీవి రామయ్య సతీమణి జానకమ్మకు ఘన సత్కారం.. భారీగా తరలివచ్చిన జనసేన శ్రేణులు...

**ఖమ్మం (జనం ముచ్చట):** ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎంబీ ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించిన 'తెలంగాణ జనసేన శంఖారావం' బహిరంగ సభ జనసేన శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తరలివచ్చారు. సభా వేదికపై జనసేన రాష్ట్ర ముఖ్య నేతలు ప్రసంగిస్తూ తెలంగాణలో పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలు, సామాజిక న్యాయం, యువత, రైతులు, నిరుద్యోగుల సమస్యలపై తమ వైఖరిని వెల్లడించారు..




# ఖమ్మంలో హోరెత్తిన...
# జనసేన శంఖారావం

(మొదటి పేజీ తరువాయి)

తరలిరావడంతో ర్యాలీ సాగిన ప్రధాన మార్గాలు సందడిగా మారాయి. ఎటుచూసినా జనసేన జెండాలు,నినాదాలతో ఖమ్మం నగరంలో రాజకీయ వాతావరణం నెలకొంది....

**పొంగులేటిపై గడల శ్రీనివాస్ ఘాటు వ్యాఖ్యలు...**

ఈ సందర్భంగా గడల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటగా ఓటమి చెందే వ్యక్తి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డేనని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.పొంగులేటి ఎక్కడి నుంచి పోటీ చేసినా, చివరకు పాలేరు నుంచి బరిలోకి దిగినా ఆయనకు ఓటమి తప్పదని సవాల్ చేశారు.

ఒకప్పుడు 'శ్రీనన్న అంటే నేను ఉన్నాను' అనే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు 'శ్రీనన్న అంటే నేను హైదరాబాద్‌లో ఉన్నాను' అనే పరిస్థితి ఏర్పడిందంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గడల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఇకపై ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజలకు, కార్యకర్తలకు అండగా 'గడల శీన్నన్న' ఉన్నారు' అనే నమ్మకాన్ని కల్పిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఇప్పటి నుంచే తన రాజకీయ కార్యాచరణను వేగవంతం చేస్తున్న సంకేతాలను ఈ సభ ద్వారా ఇచ్చిందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి....

**గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం...**

గత కొన్ని నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామని గడల శ్రీనివాస్ తెలిపారు. పార్టీని కేవలం పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ప్రతి గ్రామంలో జనసేనకు కార్యకర్తల బలం పెరగాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపించినప్పుడు మాత్రమే రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా, ప్రజల మధ్య నిరంతరం



ఉంటూ వారి సమస్యలపై స్పందించే విధంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సూచించారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని గడల శ్రీనివాస్ విమర్శించారు. ముఖ్యంగా నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ప్రజా సమస్యలపై జనసేన నిరంతరం ప్రశ్నించే గొంతుకగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో జనసేన తనదైన ముద్ర వేయడంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు....

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలే తొలి లక్ష్యం**

త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను జనసేన అత్యంత కీలకంగా తీసుకుంటోందని గడల శ్రీనివాస్ తెలిపారు. ఎన్నిక ఏదైనా జనసైనికులు కష్టపడి పనిచేసి పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. గ్రామాలు, మండలాల్లో పార్టీకి బలమైన పునాది ఏర్పడితే భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా జనసేన ప్రభావాన్ని చూపించవచ్చని పార్టీ నేతలు పేర్కొన్నారు అదే విధంగా ఇప్పటివరకు ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చే స్థాయిలో ఉన్న జనసేన భవిష్యత్‌లో తమ మద్దతుతో ప్రభుత్వాలు ఏర్పడే స్థాయికి ఎదగాలని గడల శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికల దిశగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు,ప్రతి ఎన్నికను అవకాశంగా తీసుకుని పార్టీ బలాన్ని పెంచుకోవాలని, ప్రజల్లో జనసేనపై నమ్మకం కల్పించాలని సూచించారు. కార్యకర్తల కష్టమే పార్టీ భవిష్యత్‌కు బలమని పేర్కొంటూ, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు....

**పొంగులేటి వర్సెస్ జనసేన.. రాజకీయ సమీకరణాలపై ఆసక్తి...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మొదట ఓడిపోయే వ్యక్తి అవుతారంటూ గడల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.ముఖ్యంగా పాలేరు నుంచి పోటీ చేసినా పొంగులేటికి ఓటమి తప్పదంటూ ఆయన చేసిన సవాల్ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పోటీ వాతావరణం నెలకొని ఉండగా,జనసేన కూడా స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా తన బలాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు శంఖారావం సభ స్పష్టం చేసింది.

సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి పార్టీ నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికలు, రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా జనసేన కార్యాచరణ సాగుతున్న నేపథ్యంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఆ పార్టీ ఎలాంటి ప్రభావం చూపనుందనేది ఆసక్తికరంగా మారింది.ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ గడల శ్రీనివాస్ చేసిన ఘాటు వ్యాఖ్యలకు రాజకీయంగా ఎలాంటి స్పందన వస్తుంది? జనసేన సవాల్‌ను అధికార కాంగ్రెస్ ఎలా తీసుకుంటుంది? స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన ఎంత మేరకు ప్రభావం చూపుతుంది? అనే అంశాలు రానున్న రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి..

---

# ఖమ్మంలో జనసేన 'తెలంగాణ శంఖారావం'..
# రాష్ట్ర నేతల రాజకీయ గర్జన

(మొదటి పేజీ తరువాయి)

**వనజీవి రామయ్య ప్రాంగణంగా సభా వేదిక...**

తొలుత పర్యావరణ పరిరక్షణ కోసం జీవితాంతం కృషి చేసిన ఖమ్మం ముద్దుబిడ్డ, పద్మశ్రీ పురస్కార గ్రహీత దివంగత వనజీవి రామయ్య సేవలను జనసేన నేతలు స్మరించుకున్నారు. ఆయన స్మారకార్థం సభా వేదికకు 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం'గా నామకరణం చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితురాలిగా హాజరైన వనజీవి రామయ్య సతీమణి శ్రీమతి జానకమ్మను జనసేన రాష్ట్ర నాయకత్వం ఘనంగా సత్కరించింది. శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం రామయ్య చేసిన కృషి, ఆయన హరిత తపస్సు నేటి తరానికి ఆదర్శమని నేతలు పేర్కొన్నారు....

**గిరిజన బాలిక హత్యపై నివాళి....**

సభ ప్రారంభంలో ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో దారుణ హత్యకు గురైన ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం, ములకలపల్లి మండలం చౌటప్పగూడెం గ్రామానికి చెందిన గిరిజన బాలిక ఘటనను జనసేన నేతలు తీవ్రంగా ఖండించారు. బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సభా ప్రాంగణంలో నేతలు, కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం బాధితురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను వేదికపైకి ఆహ్వానించిన జనసేన



నాయకులు వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు తాళ్లూరి రామ్, నేమూరి శంకర్ గౌడ్, సాగర్ ఆర్.కె. నాయుడు, తనీష్ అల్లాడి, రాధారం రాజలింగం తదితరులు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు జనసేన తరఫున న్యాయపోరాటం కొనసాగిస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలబడతామని నేతలు హామీ ఇచ్చారు.

**'జనసేన ఎన్నికల పార్టీ కాదు'.. తాళ్లూరి రామ్...**

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ మాట్లాడుతూ.. జనసేన కేవలం ఎన్నికల సమయంలో కనిపించే పార్టీ కాదని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే శక్తి అని అన్నారు. ఎన్ని రాజకీయ కుట్రలు, అడ్డంకులు ఎదురైనా తెలంగాణలో జనసేన ఎదుగుదలను ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. నిరుద్యోగులు, రైతులు, పేదల సమస్యలపై జనసేన నిరంతరం గొంతు వినిపిస్తుందని తెలిపారు. తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ చేస్తామని స్పష్టం చేశారు....

**'తెలంగాణ ఎవరి జాగీరు కాదు'.. నేమూరి శంకర్ గౌడ్....**

జనసేన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కొందరి జాగీరు కాదని వ్యాఖ్యానించారు. సకల జనుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సామాజిక న్యాయం అందాల్సిన అవసరం ఉందన్నారు.రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన కీలక శక్తిగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని పార్టీ తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తుందని తెలిపారు.

**యువతకు జనసేన ప్రత్యామ్నాయం: సాగర్ ఆర్.కె. నాయుడు....**

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ తెలంగాణలో మార్పును కోరుకుంటున్న యువతకు జనసేన ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానం క్షేత్రస్థాయిలోకి బలంగా వెళ్తున్నాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో జనసేన జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యువతను పెద్ద సంఖ్యలో పార్టీతో అనుసంధానం చేస్తూ గ్రామస్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

**భారీగా తరలివచ్చిన జనసేన శ్రేణులు...**

'తెలంగాణ శంఖారావం' సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. తెలంగాణలోని పలు జిల్లాల నుంచి కూడా పార్టీ శ్రేణులు హాజరయ్యాయి. నియోజకవర్గాల ఇంచార్జులు, మండల, గ్రామస్థాయి బాధ్యులు, వీర మహిళలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో జనసేన నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రాష్ట్ర నేతల ప్రసంగాలకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున స్పందించారు. మొత్తంగా ఖమ్మం వేదికగా నిర్వహించిన 'తెలంగాణ జనసేన శంఖారావం' సభ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తమ రాజకీయ ఉనికిని, సంస్థాగత బలాన్ని చాటిచెప్పామని జనసేన నేతలు పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి సర్కార్ రైతులను నట్టేట ముంచింది

## పువ్వాడ అజయ్ కుమార్

**రైతులకు కరెంట్, సాగునీరు ఇవ్వని చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వాని పాలించే హక్కు లేదు...**

**24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే...**

రఘునాథపాలెం (జనం ముచ్చట):

రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు.రైతులకు కరెంట్, సాగునీరు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందని ఆయన మండిపడ్డారు. రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పగటిపూట ఉపాధి లేక, రాత్రివేళల్లో కరెంట్ లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు....

**మళ్లీ పాత కాంగ్రెస్ రోజుల పరిస్థితి...**

రైతులకు అవసరమైన సమయంలో మూడు ఫేజ్‌ల విద్యుత్ అందకపోవడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. దీంతో గతంలో కాంగ్రెస్ పాలనలో కనిపించిన దుస్థితి మళ్లీ పునరావృతమవుతోందని విమర్శించారు.

కేసీఆర్ పాలనలో రైతులు ధైర్యంగా, దర్జాగా పొలాల్లో పనిచేసుకునే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం యూరియా బస్తాల కోసం యాప్‌ల పేరుతో రైతులను



క్యూలైన్లలో నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.....

**రుణమాఫీపై పువ్వాడ సవాల్...**

రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని పువ్వాడ ఆరోపించారు. పంటల సాగు సమయంలో రైతులకు అవసరమైన సహాయం అందడం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను సమయానికి అమలు చేయకుండా ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ హామీని ఏ ఒక్క గ్రామంలోనూ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. రఘునాథపాలెం మండలంలోని ఏ గ్రామానికైనా వచ్చి రుణమాఫీ అమలుపై బీఆర్ఎస్ సవాల్‌ను స్వీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు....

**మహిళలకు రూ.2,500 హామీ ఏమైంది?**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందని పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని, మూడు సంవత్సరాలకు ఒక్కో మహిళకు రూ.75 వేల వరకు బకాయి పడినట్లు లెక్కలతో వివరించారు.అదేవిధంగా మహిళలకు రూ.1,00,116 ఆర్థిక సాయం అందించడంతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఏ ఒక్క మహిళకూ తులం బంగారం ఇవ్వలేదని విమర్శించారు అంతే కాకుండా వృద్ధులకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని పువ్వాడ ఆరోపించారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీ కూడా మాటలకే పరిమితమైందని విమర్శించారు....

**తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష....**

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని, సాగునీరు, ఉచిత విద్యుత్ వంటి చర్యలతో రైతులకు నిజమైన భరోసా లభించిందని పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. “కేసీఆర్ ఆనాడే చెప్పారు.. మోసపోతే గోసపడతారు” అని ఆయన వ్యాఖ్యానించారు.సాగునీరు, ఉచిత విద్యుత్ అందించిన కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. రైతాంగం, ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాసా రామారావు, ఆర్జెసీ కృష్ణ, గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటె ముక్కల వెంకటేశ్వర్లు, పిన్నికోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్, దొంతు సత్యనారాయణ, హనుమంత్‌రావు, ఎల్లబాబు, గోవర్ధన్, రవి, వినోద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తికి ప్రతీక చిర్రావూరి లక్ష్మీనర్సయ్య

## సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం సిటీ(జనం ముచ్చట):

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పునాది వేసిన కామ్రేడ్ చిర్రావూరి లక్ష్మీనర్సయ్య జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు.చిర్రావూరి లక్ష్మీనర్సయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఖమ్మం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి సీపీఐ(ఎం) నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అదేవిధంగా చిర్రావూరి లక్ష్మీనర్సయ్య స్వగ్రామమైన కైకొండాయిగూడెంలో కూడా ఆయన చిత్రపటానికి సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వై. విక్రమ్, మాదినేని రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం....**

ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద చిర్రావూరి లక్ష్మీనర్సయ్య విగ్రహం వద్ద నిర్వహించిన సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు.ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన ఎన్నో అరెస్టులు, చిత్రహింసలు, సుదీర్ఘ జైలు జీవితాన్ని ఎదుర్కొన్నప్పటికీ ప్రజా ఉద్యమం నుంచి ఏమాత్రం వెనక్కి తగ్గలేదని అన్నారు. అణగారిన వర్గాలు, పేదలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాటం సాగించారని కొనియాడారు.

**ఖమ్మం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర...**



ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం, విస్తరణలో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య కీలక పాత్ర పోషించారని నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేశారని తెలిపారు. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని ఉద్యమాలను నిర్మించి, ప్రజల్లో కమ్యూనిస్టు ఉద్యమానికి బలమైన పునాదులు ఏర్పరిచారని అన్నారు. అదే విధంగా చిర్రావూరి లక్ష్మీనర్సయ్య మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా నిబద్ధతతో పాలన సాగించారని నున్నా నాగేశ్వరరావు అన్నారు. పేదలు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. ప్రజా పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా ప్రజాసేవకు అంకితం చేసిన ఆదర్శ ప్రజాప్రతినిధిగా చిర్రావూరి లక్ష్మీనర్సయ్య నిలిచిపోయారని అన్నారు.

**ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి....**


ప్రస్తుతం సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నున్నా నాగేశ్వరరావు అన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలను తిప్పికొట్టి ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు.

చిర్రావూరి లక్ష్మీనర్సయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు.కార్యక్రమంలో ముందుగా సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చిర్రావూరి లక్ష్మీనర్సయ్య విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఏ. జబ్బార్, షేక్ మీరా సాహెబ్, ఎస్. నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, బండారు రమేష్, భూక్య శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సి. భారవి, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య కుమారుడు అచ్యుతరావు, పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు, ఒకటవ పట్టణ కార్యదర్శి షేక్ నాగులు మీరా, అర్బన్ మండల కార్యదర్శి బత్తిన ఉపేంద్ర, కార్పొరేటర్లు ఎర్ర గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు, మాజీ కౌన్సిలర్లు బండారు యాకయ్య, వంజాకు లక్ష్మీనారాయణ, ఎస్‌కే మెహరున్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ నాగేశ్వరరావు ఆశయాలే స్ఫూర్తి

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్




**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** దివ్యాంగుల జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, వారి కదలికలకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం రోటరీ క్లబ్, పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేసి ప్రసంగించారు. తన తండ్రి, కమ్యూనిస్టు నాయకుడు, ప్రజా పక్షాన నిలిచిన పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, అయితే ఈసారి వినాయక చవితి సందర్భంగా ఒక రోజు ముందుగానే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు...

**పువ్వాడ ఫౌండేషన్ తరపున రూ.3,52,000 ఆర్థిక సహాయం....**

అదే విధంగా గత 14 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 1,140 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను అమర్చినట్లు పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తన తండ్రి 88 నిండు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మానవతా దృక్పథంతో బాధితులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పువ్వాడ ఫౌండేషన్ తరపున రూ. 3,52,000 ఆర్థిక సహాయాన్ని రోటరీ ట్రస్ట్ ద్వారా అందజేసినట్లు తెలిపారు. ఈ నిధులతో కార్యక్రమాన్ని నిర్వహించి, ఒక్క రోజే 88 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందించినట్లు పేర్కొన్నారు....

**రోటరీ లింబ్ సెంటర్ సేవలు అభినందనీయం....**

గత 30 ఏళ్లుగా ఖమ్మంలోని రోటరీ లింబ్ సెంటర్ ద్వారా వేలాది మంది దివ్యాంగులకు సేవలు అందించడం అభినందనీయమని పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రోటరీ లింబ్ సెంటర్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. కృత్రిమ పాదాల ద్వారా కేవలం నడకకు మాత్రమే కాకుండా దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కూడా ఈ సేవలు దోహదపడుతున్నాయని చెప్పారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, వైద్య బృందం, సిబ్బంది, నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం...**

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే 1996లో 'మమతా హాస్పిటల్ (జనతా హాస్పిటల్)' ప్రారంభించామని పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు లక్షలాది మంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు ప్రజల కోసం పనిచేసిన నాయకుడని, ఆయన సేవా భావం తమ కుటుంబానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తమ కుటుంబం విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో ప్రజలకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రోటరీ ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ హరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కాళ్ళ పాపారావు, సెక్రటరీ దొడ్డపనేని సాంబశివరావు, వంగల జగన్నాథం, పసుమర్తి రంగారావు, ఎన్.వి.ఎన్.వి.ఎస్. ప్రసాద్, చిటోజు రామకృష్ణ, వల్లభనేని రామారావు, నాయకులు అర్జేసి కృష్ణ, పగడాల నాగరాజు, బత్తుల మురళి తదితరులు పాల్గొన్నారు.

# 1981, 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థుల

# ఆత్మీయ సమ్మేళనం



**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఎస్సార్ అండ్ బీజేఎన్ఆర్ గౌడ్ డిగ్రీ కళాశాల, ఖమ్మంలో 1981, 1984 బి.ఏ. ఈ.పీ.పీ. బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల 4వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మం జూబ్లీ క్లబ్‌లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. ఈ సమ్మేళనానికి మొత్తం 40 మంది బ్రాంచ్‌మేట్స్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారిలో నలుగురు మహిళా పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా పూర్వ విద్యార్థులను గౌరవిస్తూ అందరి తరపున చీరలను బహూకరించారు. దీంతో కార్యక్రమం మరింత ఆత్మీయ వాతావరణాన్ని సంతరించుకుంది.

జూబ్లీ క్లబ్ సెక్రటరీ మోతుకూర్ నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి తమ అభిమానం, ఆత్మీయతను చాటుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పరస్పరం యోగక్షేమాలను తెలుసుకుంటూ, గతంలో కళాశాలలో కలిసి చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది ఆత్మీయంగా కలుసుకోవడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించడంలో హరినాథ్, సుదర్శన్, జమీల్, శ్రీహరి, నరసయ్య, రౌత్ రవి, బాబు నిర్వాహకులుగా వ్యవహరించారు. వారి సమన్వయంతో కార్యక్రమం స్నేహపూర్వకంగా, ఉత్సాహభరితంగా సాగింది.

పూర్వ విద్యార్థులంతా కలిసి తమ పాత జ్ఞాపకాలను పంచుకోవడంతో పాటు, భవిష్యత్తులోనూ ఇదే స్నేహబంధాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.



# పొదిల రవికుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, సెప్టెంబర్ 13: (జనం ముచ్చట)** ఖమ్మం సీనియర్ నాయకులు పొదిల రవికుమార్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించారు. ఖమ్మం చర్చ్ కాంపౌండ్‌లోని పొదిల రవికుమార్ నివాసానికి ఆదివారం వెళ్లిన పువ్వాడ అజయ్ కుమార్, ఇటీవల మృతి చెందిన ఆయన తల్లిదండ్రులు పొదిల దేవేంద్రనాథ్, విజయలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. పొదిల దేవేంద్రనాథ్, విజయలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పొదిల రవికుమార్ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడిన పువ్వాడ అజయ్ కుమార్, వారి కుటుంబానికి తన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొదిల దేవేంద్రనాథ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నివాళులు

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఖమ్మం సీనియర్ నాయకుడు పొదిల రవికుమార్ తండ్రి పొదిల దేవేంద్రనాథ్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు. ఖమ్మం నగరంలో దేవేంద్రనాథ్ కుటుంబ సభ్యులను కలిసి ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దేవేంద్రనాథ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో తాను భాగస్వామినని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేవేంద్రనాథ్ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ విషాద సమయంలో వారికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, నాయకులు వరప్రసాద్, ఇంటూరి శేఖర్, బలుసు మురళీకృష్ణ, ఆకుల గాంధీ, మహమ్మద్ చందు తదితర నాయకులు పాల్గొని దేవేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు....

# ఐక్య పోరాటాలే ఏచూరికి నిజమైన నివాళి

**ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు నూతన పోరాట వేదికలు అవసరం...**

**ఓటర్ల జాబితాల తారుమారుపై అప్రమత్తంగా ఉండాలి**

**జెన్-జీ నిరసనల్లో డిజిటల్ వేదికల పాత్ర కీలకం...**

**ఏచూరి వర్ధంతి సెమినార్‌లో న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ, తమ్మినేని వీరభద్రం...**




**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):**

సీపీఎం అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఐక్య పోరాటాలే నిజమైన నివాళి అని న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తిని కాపాడేందుకు ప్రజలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ప్రబీర్ పురకాయస్థ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. తొలుత సీతారాం ఏచూరి, మల్లారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పురకాయస్థ సూచించారు. ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు నూతన పోరాట వేదికలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫాసిస్టు ధోరణులు, సిద్ధాంతాలతో పాలన సాగిస్తున్న పాలకులు దీర్ఘకాలం అధికారంలో కొనసాగేందుకు వివిధ రకాల కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు....

**ఓటర్ల జాబితాలపై అప్రమత్తత అవసరం....**

గతంలో ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ వంటి ఘటనలు కనిపించేవని, ప్రస్తుతం ఓటర్ల జాబితాలనే తారుమారు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని పురకాయస్థ ఆరోపించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో ఓటర్లు జాబితాల నుంచి గల్లంతవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఓట్లు తొలగించబడ్డాయనే విషయం కూడా సామాన్య ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఓటు హక్కును తిరిగి పొందేందుకు దరఖాస్తులు చేసుకోవడం, అధికారులు, న్యాయస్థానాల చుట్టూ తిరగడం సామాన్యులకు ఎంతో ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. అధికార బలం, ధనబలం, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఎన్నికల సంఘం వంటి వ్యవస్థలను కూడా తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రజాస్వామ్య శక్తులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న అక్రమాలను బహిర్గతం చేస్తూ, బూత్ స్థాయి నుంచే ప్రజలను సమీకరించి ఓటు హక్కుపై చైతన్యం కల్పించడం భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రధాన పోరాటాల్లో ఒకటని వివరించారు....

**డిజిటల్ వేదికగా సెల్‌ఫోన్ కీలక పాత్ర....**

ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ కేవలం సమాచార మార్పిడి సాధనం మాత్రమే కాదని, వ్యక్తుల భావప్రకటన, స్వేచ్ఛ, జీవన విధానంలో అంతర్భాగంగా మారిందని సెమినార్‌లో పలువురు వక్తలు పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న జెన్-జీ నిరసనల నేపథ్యంలో డిజిటల్ వేదికల ప్రాధాన్యతను వారు విశ్లేషించారు. మొబైల్ ఫోన్లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా ఒకే ఆలోచన కలిగిన వ్యక్తులు ఏకమవుతున్నారని, తమ సంతోషాలు, బాధలు, నిరసనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. హాస్యం, వ్యంగ్య చిత్రాలు, సందేశాల ద్వారా ప్రభుత్వాలు, పాలకుల విధానాలను ప్రశ్నించే అవకాశాన్ని డిజిటల్ వేదికలు సామాన్యులకు కల్పించాయని అన్నారు. ఇలాంటి భావప్రకటనలను పూర్తిగా అణచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. సాంకేతికతతోనే పెరిగిన నేటి జెన్-జీ యువత తమ భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై గళమెత్తుతోందన్నారు....

**పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం....**

పరీక్షల పేపర్ లీకేజీలు యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటూ విద్యార్థులు చేస్తున్న శ్రమతో పాటు కుటుంబాలు భరిస్తున్న ఆర్థిక భారం కూడా వృథా అవుతోందన్నారు. పరీక్షల రద్దు, వాయిదాల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు మరింత అనిశ్చితిలో పడుతోందని పేర్కొన్నారు. తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసేందుకు యువత డిజిటల్ వేదికలను ప్రధాన సాధనంగా ఎంచుకుంటోందన్నారు. సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు, ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించుకుని పోరాటాలు సాగించేందుకు సెల్‌ఫోన్ ఒక శక్తివంతమైన ప్రజా సమాచార సాధనంగా రూపాంతరం చెందిందని జెన్-జీ నిరసనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు....

**లౌకిక, సమాఖ్య సూత్రాల పరిరక్షణే ఏచూరికి నివాళి...**

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ లౌకిక, సమాఖ్య సూత్రాలను కాపాడటమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో ఓట్లు వేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం మాత్రమే కాదని, రాజ్యాంగం నిర్దేశించిన లౌకిక, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవడం కూడా ప్రజాస్వామ్యంలో కీలక భాగమని పేర్కొన్నారు. కామ్రేడ్ సుందరయ్య తర్వాత తెలుగు నేలపై అంతటి ప్రజాదరణ పొందిన కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. జేఎన్‌యూ విద్యార్థి నాయకుడిగా ఎమర్జెన్సీ సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎదుట ధైర్యంగా నిలబడి విద్యార్థుల డిమాండ్లను వినిపించిన నాయకుడిగా ఏచూరి చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, అలాగే యూపీఏ ప్రభుత్వ హయాంలో వామపక్షాల తరఫున ఏచూరి కీలక పాత్ర పోషించారని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు.....

**నాలుగు సూత్రాలపై ప్రజాస్వామ్య భవిష్యత్తు....**

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే లౌకికవాదం, సమాఖ్యవాదం, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం అనే నాలుగు కీలక సూత్రాలు అమలు కావాలని తమ్మినేని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పరిపాలన, విద్యా వ్యవస్థ, రాజకీయ పార్టీలు మతానికి దూరంగా ఉండాలని అన్నారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం లౌకిక విలువలను దెబ్బతీస్తూ మతాన్ని రాజకీయాల్లోకి తీసుకువస్తోందని విమర్శించారు. భారత్ విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల సమాహారమని, అందువల్ల అధికారాలన్నీ కేంద్రంలో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రాలు, పంచాయతీలకు తగిన నిధులు, అధికారాలను వికేంద్రీకరించాలని సూచించారు. 'డబుల్ ఇంజన్ సర్కార్' పేరుతో రాష్ట్రాల హక్కులను భంగపరచడం సమాఖ్య వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.....

**ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ ప్రజాస్వామ్యం బలహీనం....**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించిన విధంగా ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ల దోపిడీ పెరుగుతోందని, ఓటును డబ్బుతో కొనుగోలు చేసే స్థాయికి రాజకీయ వ్యవస్థ దిగజారడం ఆందోళనకరమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ప్రజలు సంఘటితమై పోరాడాలని, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి కోసం ఐక్య ఉద్యమాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సెమినార్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి విక్రమ్, నాయకులు బి. సరళ, పి. సోమయ్య, పి. వెంకటేశ్వర్లు, బండి రమేష్, భారతి, కళ్యాణం వెంకటేశ్వర్లు, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బండి పద్మ, భుక్యా వీరభద్రం పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు వినాయక సమితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దంపతులు





**సత్తుపల్లి సెప్టెంబర్ 13 (జనం ముచ్చట)**

వినాయక చవితి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానందు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వినాయక చవితి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను వినాయకుడు తొలగించాలని ఎమ్మెల్యే దంపతులుమనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పరమ పవిత్రమైన వినాయక చవితి పండగ పర్వదినం సందర్భంగా ఇళ్లలో మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని వారు పేర్కొన్నారు. పండగ పర్వదినాన్నిపురస్కరించుకొని మండలాల్లోని ఏర్పాటు చేసుకున్న అన్ని మండపాలలో మట్టి వినాయకులను పూజించి మనసంస్కృతినిపర్యావరణాన్నిపరిరక్షించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ పట్టా రాగమయి దయానందు, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్

విజయకుమార్లు పిలుపునిచ్చారు. గణనాథుని ఆశీస్సులతో నియోజకవర్గ , రాష్ట్ర, ప్రజలు ఆయురారోగ్యాలు తో, సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్షించారు.